విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందజేత

ప్రజాశక్తి-కలికిరి : ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని గుట్టపాలెం మాజీ సర్పంచ్ వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుట్టపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా మిత్ర స్టూడెంట్ కిట్లను ప్రధానోపాధ్యాయుడు ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సౌకర్యాలు కల్పించారని తెలిపారు. విద్యా మిత్రా కిట్లను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు తల్లి దీవెన పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు డబ్బులు కూడా ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకొని వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు టిడిపి నాయకులు కార్యకర్తలు, గుట్టపాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థికి కిట్ పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

రెవెన్యూ సిబ్బంది ఇళ్లల్లో సోదాలు

- రాయచోటి, శిబ్యాలలో పోలీసులు, రెవెన్యూ అధికారుల తనిఖీలు
- భారీగా నకిలీ రెవెన్యూ రికార్డులు, ఇంటి పట్టాలు స్వాధీనం

ప్రజాశక్తి-రాయచోటి

నకిలీ రెవెన్యూ రికార్డులు, టికెటి పట్టాలు తయారు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది ఇళ్లలో రెవెన్యూ, పోలీసు అధికారులు సోమవారం సాయంత్రం సోదాలు చేపట్టారు. ఈ సంఘటన జిల్లాలో సంచలనం రేకెత్తించింది. రెవెన్యూ అధికారులు భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు అందింది. అందిన ఫిర్యాదు ఆధారంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రెవెన్యూ అధికారులపై తనిఖీలు చేపట్టాలంటూ కలెక్టర్ రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కదిలింది. రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో

శిబ్యాలలో రిటైర్డ్ విఆర్ఓ నాగరాజు ఇంట్లో తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

రాయచోటిలో డిటి యునీత్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు

నివాసముంటున్న సుండుపల్లి డిప్యూటీ తహశీల్దార్ యునీత్ కుమార్‌రెడ్డి, అతని ముఖ్య అనుచరుడు ఖాదర్‌వలీ నివాసాలతోపాటు శిబ్యాల గ్రామంలో ఉన్న దివంగత విఆర్ఓ నాగరాజు నివాసంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ముమ్మరంగా సోదాలు చేపట్టారు. ఈ సోదాలలో రెవెన్యూ అధికారుల ఇండ్ల నుంచి భారీ స్థాయిలో నకిలీ ఇంటి పట్టాలు, వన్‌బిలు, అడంగల్లు, భూమి పాస్ పుస్తకాలతోపాటు రెవెన్యూకు సంబంధించిన విలువైన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రాత్రి పొద్దుపోయే వరకూ సోదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. డిప్యూటీ తహశీల్దార్ యునీత్ కుమార్‌రెడ్డి గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాయచోటి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసి అంతా తానై అన్నట్లుగా వ్యవహరించారు. ఆ సమయంలో రాయచోటి తహశీల్దార్ కార్యాలయంలో విలువైన రెవెన్యూ రికార్డులు మాయమయ్యాయని అప్పట్లోనే పుకార్లు షికార్లు ముమ్మరంగా జరిగాయి. సాధారణ బదిలీలలో భాగంగా కలెక్టర్ ఆదేశాలను పలుమార్లు లెక్క చేయకపోవడంతో యునీత్ కుమార్‌రెడ్డిని అధికారులు సస్పెండ్ చేశారు. సస్పెండ్ గడువు ముగియడంతో ఇటీవలే ఆయన కె.వి.పల్లి మండలం నుంచి సుండుపల్లి మండలానికి రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు.

నిరుపేద దళితులకు సాగుభూమి ఇవ్వాలి : సిపిఎం

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- గాలివీడు

మండలంలోని తూముకుంట దళితవాడలోని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నిరుపేద దళితులకు ఒకొక్కరికి రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలంటూ కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడులో ఇప్పటి వరకు తొమ్మిది అసైండ్ కమిటీలు జరిగినా తూముకుంట దళితులకు ప్రాధాన్యత ఇవ్వలేదని పేర్కొన్నారు. వారు ప్రస్తుతం భూమి లేని నిరుపేదలుగా, గ్రామీణ శ్రామికులుగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని పేర్కొన్నారు. కనీసం ఉపాధి పనులు దొరక్క అర్ధాకలితో నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసుతుల కల్పనలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక మార్లు అసైన్‌మెంట్ కమిటీలో దళితులకు మొండిచేయి చూపారని తెలిపారు. మండలంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా కాపాడే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన స్థలంతో పాటు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇచ్చేంత వరకూ దళిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో నిరవధిక ఉద్యమాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం తూముకుంట గ్రామ దళితులు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణలో మాట్లాడుతున్న నిస్సార్ అహమ్మద్

జగన్ అంటే నమ్మకం : నిస్సార్

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్: వైసిపి అధినేత వై.ఎస్.జగన్మో హన్‌రెడ్డి అంటే నమ్మకం, టిడిపి అధినేత చంద్రబాబు అంటే మోసం అని మదనపల్లె వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో వెన్నుపోటు బుక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎక్కడ పడితే అక్కడ మదనపల్లెను జిల్లా చేస్తాం, రాజంపేటను జిల్లా చేస్తాం, రాయచోటిని జిల్లా గా కొనసాగిస్తామని మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కారన్నారు. పాలన చేపట్టి ఏడాది అవుతున్నా ఏమి సాధించారని నిలదీశారు. మదనపల్లె జిల్లా అవుతుందని ఊదరగొట్టే ఎమ్మెల్యే షాజహాన్ బాషా జిల్లా ఊసెక్కడని ప్రశ్నించారు. బిటి కళాశా లను యూనివర్సిటీని చేయాలని కష్టపడిన ఎంపీ మిథున్ రెడ్డి పైన విమర్శలు గుప్పించిన టిడిపి ఇప్పుడు ఏమి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల కోసం తీసుకొచ్చిన మెడికల్ ప్రారంభించ లేదని పేర్కొన్నారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిని నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, ఇక్కడ కనీసం మందులు కూడా అందే పరిస్థితి లేదని తెలిపారు ప్రతీ మెడికల్ కేసును రెఫర్ చేయడం తప్ప వైద్యం శూన్యమన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి: జిల్లాలో జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పక్షోత్సవాలను విజయ వంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ధర్తీ ఆబ జన్ భగిదరి అభియాన్ కింద ఈనెల 30 వరకు జిల్లాలో నిర్వహించే జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పక్షోత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను జెసి ఆదర్శ్ రాజేంద్రన్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత మారుమూల ప్రాంతాలలో నివాసం ఉంటున్న గిరిజనులకు రోడ్లు, నీరు, ఆరోగ్యం, టెలి కమ్యూనికేషన్, విద్యుత్, గృహాలు వంటి మౌలిక సదుపాయాలను అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్‌రావు, ఆర్‌డిఓ శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, గిరిజన సంక్షేమ అధికారి తేజస్విని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - రాయచోటి

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ ట్రైనింగ్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, ఎపి ఎస్ఎస్‌డిసి, డిఇఒ అండ్ ఎస్ఎస్‌సిడిఎపి సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళా రాయచోటిలోని శ్రీ షిరిడి సాయి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళ వారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే నిరుద్యోగులు, విద్యార్థులు నైపుణ్యం ఎపి గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రెజ్యూమ్, ఆధార్, పాన్‌కార్డులు, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు, ఫార్మల్ డ్రెస్సుల్లో రావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9177143181, హెల్ప్ లైన్ 9988853335లో సంప్రదించాలని తెలిపారు.

కడప, చిత్తూరు జట్ల ఘన విజయం

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో సోమవారం జరిగిన మ్యాచుల్లో అనంతపురం, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురంపై కడప జట్టు 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.4 ఓవర్లలో 130 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వీరారెడ్డి 25 పరుగులు చేశాడు. కడప జట్టులోని నాగ కుల్లాయప్ప 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 131 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 15.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 132 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 90 పరుగులు చేశాడు. **కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో** నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 8 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 21.4 ఓవర్లలో 81 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని భరద్వాజ్ 26, విఖ్యాత్ 24 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ధనుష్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. సాయి చరణ్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 82 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 15.2 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని వరుణ్ 50 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మహిత్ ఒక వికెట్ తీసుకున్నాడు.

తలపడుతున్న కడప, అనంతపురం జట్లు

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- సన్న బియ్యం దాచుకుని, పాత బియ్యంతో భోజనాలు
- అన్నాన్ని పారబోస్తున్న విద్యార్థులు
- ప్రభుత్వ నిబంధనలు గాలికొదిలేసిన ప్రిన్సిపల్
- విద్యార్థుల కడుపు కొడుతున్న వైనం

ముద్దగా ఉన్న అన్నం, తినలేక చెత్త కుండీలో పడేస్తున్న విద్యార్థి

ప్రజాశక్తి-కలకడ

పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో పురుగులు దర్శనమిచ్చాయి. మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఈ ఘటన జరిగింది. మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని, ఎలా తింటామని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యంతో మధ్యాహ్నం పథకం ద్వారా భోజనాలు వడ్డించాలని అన్ని పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేసి ఆదేశాలు జారీ చేశారు. కొన్ని పాఠశాలల్లో సన్న బియ్యం దాచుకొని పాత బియ్యంతోనే భోజనాలు పెడుతున్న వైనం కనిపిస్తోంది. ఈ దశలోనే మండలంలో ఉన్న స్థానిక ఆదర్శ పాఠశాలలో సన్న బియ్యం దాచుకోవడం పాత బియ్యంతో భోజనాలు వండుతున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేసి ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలు అందించాలని ఉద్దేశంతో ఉంది. మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, వ్యతిరేకంగా సన్న బియ్యం దాచుకొని, పాత బియ్యంతో విద్యార్థులకు భోజనాలను ప్రిన్సిపల్ మలంషావలి పెట్టడం విరుద్ధంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యార్థులు భోజనాలు తినలేక ఆరోగ్యాలు అడుగుతున్నట్లు గుర్తించి, నేటి ప్రభుత్వం వారికి నాణ్యమైన భోజనాలు వడ్డించేందుకు నడుం బిగించింది. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మలం షావలి దీనికి విరుద్ధంగా పాత బియ్యం అనగా పురుగులతో గూళ్ళు కట్టిన బియ్యాన్ని విద్యార్థులకు వండించడం జరుగుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొంతమంది విద్యార్థులు ఈ భోజనాలను తినలేక చెత్తకుప్పలో పారవేస్తూ పస్తులు ఉంటూ విద్యను చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురుగులు పట్టి ఉండలుగా ఉన్న బియ్యం

ప్రిన్సిపల్‌కు చెప్పినా పట్టించుకోలేదు

సన్నబియ్యంతో భోజనాలు చేయమని చెప్పినప్పటికీ ప్రిన్సిపల్ తన మాటలు లెక్కచేయకుండా పురుగులు పట్టిన పాత బియ్యంతోనే భోజనాలు వడ్డిస్తూ విద్యార్థులు ఆరోగ్యానికి దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. సన్న బియ్యం మాట గాలికి వదిలేసి, పురుగులు పట్టిన పాత బియ్యంతో భోజనాలు పెట్టించడం చాలా బాధాకరం.

- కె.రమేష్‌నాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్.

పాత బియ్యం అయిపోయాకే సన్నవి వాడమన్నారు

పాత బియ్యం అయిపోయకనే సన్నబియ్యాన్ని డిఇఒ వాడమన్నారు. తమకు గత వేసవి సెలవుల్లో నిర్వహించిన శిక్షణ సమయంలో మీ పాఠశాలలో ఉన్న పాత బియ్యం అయిపోయిన అనంతరం సన్నబియ్యంతో భోజనాలు వడ్డించాలన్నారు. పాత బియ్యంతోనే భోజనాలు చేశాం. సోమవారం డిఇఒ ఫోన్ చేసి పాత బియ్యం పక్కనపెట్టి సన్న బియ్యంతోనే విద్యార్థులకు భోజనాలు వడ్డించాలని ఆదేశించారు. ఇకపై సన్న బియ్యంతోనే విద్యార్థులకు భోజనాలు పెడతాం.

- మలంషా వలి, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు : కలెక్టర్

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని తెలిపారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని చెప్పారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుచి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజా సమస్యలపై దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మదనపల్లె

ప్రజల సమస్యలను ప్రత్యక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ప్రజా దర్బార్ ఎం. షాజహాన్ బాషా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ వ్యక్తిగత , స్థానిక సమస్యలపై అర్జీలు సమర్పించగా, ఎమ్మెల్యే స్వయంగా వాటిని పరిశీలించారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి, కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు సూచించారు. ప్రజల మేలు కోసమే ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల అర్జీలను వేగంగా పరిష్కరించడమే తన ప్రాధాన్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కొత్తపల్లి అగ్రహారానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి

రైల్వే కోడూరు నియోజవర్గం, పుల్లంపేట మండలం, కొత్తపల్లె అగ్రహారానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు బిఎస్‌పి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం డిఆర్ఓ మధుసూదన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు యుగంధర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలు మారలేదని పేర్కొన్నారు. అందుకు నిదర్శనమే కొత్తపల్లి అగ్రహారం రోడ్డు సమస్య అని అన్నారు. ఇప్పటికీ వంద కుటుంబాల ప్రజలు రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులలో రోడ్డు లేకపోవడంతో వాహనాలు రావడానికి ఇబ్బందిగా ఉందని, అనేకమంది ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తక్షణం రోడ్డు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా కార్యదర్శి నరసింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో రీ సర్వే వల్ల ప్రజలకు భూమి 10 ఎకరాలు పైబడి ఉందని ఆన్‌లైన్‌లో చూపడం వల్ల వారి పిల్లలకు తల్లికి వందనం నోచుకోలేదని టిడిపి నాయకులు అంజనారెడ్డి ఆధ్వర్యంలో బాధితులు తహశీల్దార్‌కు విన్నవించారు. రీ సర్వే వల్ల చోటు చేసుకున్న పొపాటర్లను సరిచేసి పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ శ్రీనివాసులు, పట్టాభిరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, సుబ్బయ్య నాయుడు పాల్గొన్నారు.

ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా జాబీర్

ప్రజాశక్తి-గాలివీడు

పెద్దూరు కస్పాలో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా షేక్ జాబీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాయచోటి అలీమాబాద్ ఉర్దూ స్కూల్ నుంచి ఉద్యోగోన్నతిపై గాలివీడు ఉర్దూ ఉన్నత పాఠశాలకు ప్రధానోపా ధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. 2011- 2017 లో ఇదే పాఠశాలలో నాలుగేళ్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఆరేళ్లు సైన్స్ ఉపాధ్యాయులుగా పని చేశారు. ఉపాధ్యాయుడిగా పని చేసిన పాఠ శాలలో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు తీసుకోవడంపై పాఠశాల ఉపాధ్యా యులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దూరు కస్పాకు చెందిన పెద్దలందరూ హర్షం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా పనిచేసే ఉపాధ్యాయుల సమస్యల పైన అలుపెరగని పోరాటం చేస్తున్నారు.

పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, 2026 పద్మా అవార్డుల (పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ) కోసం 'సామాజిక సేవ' రంగంలో అర్హులైన వారు ఆన్లైన్ https://awards. gov.in ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకొని హార్డ్, సాఫ్ట్ కాపీలను స్టెప్ కార్యాలయంలో ఈనెల 28లోగా పోస్టు ద్వారా కాని లేక నేరుగా సమర్పించాలని స్టెప్, ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయి గ్రేస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారి నామినేషన్లను జిల్లా కలెక్టరు ఆమోదంతో తదుపరి చర్య తీసుకుంటామని తెలిపారు. ఇతర వివరాలకు స్టెప్, మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు 9949298810, జూనియర్ అసిస్టెంట్ వి.వి. నారాయణ 9849497045 వారిని సంప్రదించాలని తెలిపారు.

25న విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-సుండుపల్లి

విఆర్ఏ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 25న ధర్నా నిర్వహిం చనున్నామని విఆర్ఏ సంఘం మండల అధ్యక్షులు నాగరాజు, అల్లాబకాష్ పేర్కొ న్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలను ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో విఆర్ఎలు రామచంద్ర, ఎస్.రమణ, మల్లికార్జున, శంకరయ్య, శంకరమ్మ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విఆర్ఎలు

గుండ్లబురుజు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న ఉపాధ్యాయులు, మాణిక్యం

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నాదని ఎంఇఒలు పద్మావతి, నారాయణలు తెలిపారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించే కార్యక్రమాన్ని మండలంలో విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు జయరామిరెడ్డి, మాల మహానాడు మండల అధ్యక్షులు వీరనాల మాణిక్యంతో కలిసి గ్రామంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాన్విక, మమత, అనూష, వసంత్ అనే విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ బడుల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నాదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో కొత్త సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. కొత్తగా సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని వర్తింప చేస్తూ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున పాఠశాల ప్రారంభ దశలోనే ఇవ్వడం గమనార్హమన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో పిల్లల చదువుల కోసం రూ.లక్షలు ఖర్చుపెట్టి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను వారికి అందించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు ఉచితంగా అందించడం జరుగుతున్నాదన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి ఎఒ మంజుల

మండల వ్యవసాయ అధికారిగా ఎస్.మంజుల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న వ్యవసాయ అధికారి యు.మురళీ మోహన్ వాల్మీకిపురం మండలానికి బదిలీ కాగా, కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారి ఎస్.మంజుల నిమ్మనపల్లెకు బదిలీపై వచ్చారు. సోమవారం స్థానిక మండల వ్యవ సాయ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. సచివాలయ వ్యవసాయ సహాయకులు ఆమెను కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సకాలంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కలిగిస్తే మేలైన దిగుబడులను సాధించవచ్చని తద్వారా రైతులు వ్యవసాయంపై ఆసక్తి చూపగలరని వివరించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పిస్తామని, అర్హులైన రైతులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ సాగు పై ఎటువంటి సందేహాలు ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే వారు రైతులకు తోడుగా ఉంటారని సూచించారు.

కలికిరి ఎఒ హేమలత

కలికిరి: ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవకు ఇకెవైసి తప్పనిసరని వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. సోమవారం నూతన వ్యవసాయ అధికారిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బి ఆధార్ కార్డు సెల్‌ఫోన్ తీసుకుని తమ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఇకెవైసి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇకెవైసి చేయనిచో అన్నదాత సుఖీభవ డబ్బులు రైతులకు అందవని తెలిపారు.

కలకడ ఎఒ శ్రీనివాస్

కలకడ: మండల వ్యవసాయ అధికారిగా ఎం.ఆర్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రమైన కలకడ వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారిణి ఎం.వి.లావణ్య విధులు నిర్వహిస్తూ ప్రొద్దుటూరుకు బదిలీపై వెళ్లారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకున్న సమస్యల పై దృష్టి సారించి వాటికి అందుబాటులో ఉండే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. రైతులకు ఏ సమస్య వచ్చిన ఆర్‌బికె సిబ్బందిని, తనను సంప్రదిస్తే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

వాల్మీకిపురం ఎఒ మురళి

వాల్మీకిపురం: క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని మండల వ్యవసాయ అధికారి మురళీ అన్నారు. సోమవారం ఆయన మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎఒ హేమలత బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో నిమ్మనపల్లె మండల వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న మురళీ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మందకృష్ణ సన్మాన సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగను వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న హైదరాబాదులో నిర్వహించనున్న భారీ సన్మాన సభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌పి జాతీయ నాయకులు వెలగచర్ల శివయ్య, రాష్ట్ర నాయకులు చేమూరు వెంకటేష్, జిల్లా నాయకులు మందా శివయ్య కోరారు. సోమవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ జరిపిన దశాబ్దకాల పోరాటాల ఫలితంగానే వికలాంగులకు రూ. 6 వేలు పింఛను సాధించారని తెలిపారు. భవిష్యత్తులో వారికి రూ.10 వేలు పింఛను ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. వికలాంగులకు ఇంటి స్థలం, రిజర్వేషన్లు, ఉద్యోగాల కోస భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలియజేశారు. వికలాంగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ సభకు ఉభయ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గాల నుండి భారీ ఎత్తున వికలాంగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య వడ్డెర, మండల అధ్యక్షులు కె. శ్రీహరి వడ్డెర, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు బి.సుబ్బయ్య, మాజీ మండల అధ్యక్షులు ఆదయ్య, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కత్తి కొండయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు మోహన్, మనోహర్ పాల్గొన్నారు.

విషపు నీరు తాగి మహిళ మృతి

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని మాలేనత్తం పంచాయతీ కొండూరు గ్రామానికి చెందిన కృష్ణప్ప భార్య సుహాసిని (26) సొంత కోళ్ల ఫారం వద్ద నీటి క్యాన్‌లో విషపు నీరు కలిసిపోయింది. అది గమనించని ఆమె దప్పిక తీర్చుకొనేందుకు కొంత నీరు తాగింది. నీరు తాగిన వెంటనే ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబీకులు వెంటనే బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు రామసముద్రం ఎస్ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైమానిక దళం సేవలు చిరస్మరణీయం : కలెక్టర్

వైమానిక సిబ్బందికి కిట్లు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

భారతదేశ వైమానిక దళం చేస్తున్న సేవలు అనిర్వచనీయమైనవని, భారత్ పాకిస్తాన్ యుద్ధ సమయంలో వైమానిక దళం కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. భారతదేశ వైమానిక దళానికి చెందిన కార్పొరల్ సందీప్, కార్పొరల్ సురేందర్ సింగ్‌లు సోమవారం ఉదయం కలెక్టర్ శ్రీధర్ చామకూరిని సోమవారం ఉదయం పిజిఆర్‌ఎస్ హాల్లో గౌరవప్రదంగా కలిసి వివిధ విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ వైమానిక దళం భారత సాయుధ దళాలకు చేస్తున్న సేవలు, భారతదేశ సమగ్రతను కాపాడడానికి చేస్తున్న సేవలను కలెక్టర్ కొనియాడారు. భారత్ పాకిస్తాన్ యుద్ధ సమయంలో వైమానిక దళం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైమానిక దళం నుంచి వచ్చిన ప్రతినిధులు జిల్లాలో అగ్ని వీర్ వాయు కార్యక్రమంపై నిర్వహించబోయే అవగాహన కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి ఉద్దేశించి మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో అగ్ని వీర్ కార్యక్రమంలో చేరే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల, రాజు కళాశాలలో అగ్ని వీర్ వాయు కార్యక్రమం పై భారతదేశ వైమానిక దళం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ వైమానిక దళానికి చెందిన కార్పోరల్ సందీప్, కార్పోరల్ సురేందర్ సింగ్, సాయి ఇంజనీరింగ్ కళాశాల, రాజు కళాశాల లలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అగ్ని వీర్ వాయు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు యువతను ఉద్దేశించి భారత వైమానిక దళంలో భారతదేశ సాయుధ దళాలలో పెద్ద ఎత్తున పాల్గొని భారతదేశానికి సేవలు అందించాలని కోరారు. ఈ మధ్యకాలంలో జరిగిన భారత్ పాకిస్తాన్ యుద్ధం సందర్భంగా యువత కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సాయుధ దళాలలో చేరి భారతదేశానికి సేవలందించి చరిత్రలో నిలిచిపోవాలని కోరారు.

అతిసార నివారణకు కృషి చేయాలి

- డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అతిసార (డయేరియా) ఉధృతిని నివారించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ కృషి చేయాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొమ్మిరెడ్డిగారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న 104 సేవా కార్యక్రమంలో సిహెచ్ఒ ఇంద్రాణితో, స్థానిక పిహెచ్‌సి సిబ్బందితో కలసి పాల్గొని ప్రజలకు అతిసారా (డయేరియా) చేతుల శుభ్రత ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ అతిసార వ్యాధిని నియంత్రణ చేయాలంటే తాగునీరును కాచి చల్లార్చి తాగాలని, రోడ్డు పైన ఉన్న పానీయాలు, ఐసు కల్పిన జ్యూస్‌లను తాగరాదన్నారు. వీటివల్ల అతిసారా, టైఫాయిడ్, గొంతునొప్పి, దగ్గు, ఊపిరితిత్తులకు ఇన్‌స్పెక్షన్, వైరల్ జ్వరాలు వంటివి వస్తాయన్నారు. చేతుల శుభ్రతలోని ఆరు దశలను తల్లులకు చేసి చూపించారు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు, వంట చేయడానికి ముందు, శిశువులకు ఫీడింగ్ ఇచ్చే ముందు, మలం కడిగిన తరువాత, ఆవులు, గొర్రెల పాకాలను శుభ్రం చేసిన తరువాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రపరచుకోవాలని తెలిపారు. అనంతరం చేతుల శుభ్రతపై ఆరోగ్య సూత్రాలు కలిగిన కరపత్రాలను, ఓఆర్ఎస్ పాకెట్స్‌ను పంపిణీ చేశారు. ఓఆర్ఎస్ ద్రావణం స్వయంగా తయారు చేసుకొనే విధానంపై చైతన్యం కలిగించి ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలను తగ్గించిండాని డయేరియా నియంత్రణ కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి జులై 31వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎఎన్ఎం చెన్నమ్మ, సూపర్వైజర్ దేవేంద్ర, ఆశా కార్యకర్త సరస్వతి, అంగన్వాడీ కార్యకర్త రెడ్డెమ్మ, బాలింతలు, మహిళలు, వృద్ధులు, పిల్లలు పాల్గొన్నారు.

నిమ్మనపలి : అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

వాల్మీకిపురం : అతిసారపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జులేఖబేగం

వాల్మీకిపురం: ఐదేళ్లలోపు పిల్లల మరణాలను తగ్గించేందుకు అతిసార వ్యాధిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ జులేఖ బేగం అన్నారు. సోమవారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి ఆవరణంలో అతిసార వ్యాధి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రభుత్వం అతిసార వ్యాధిని నిలిపేద్దాం కార్యక్రమాన్ని నిర్వహిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశాకార్యకర్తలు ప్రతి రోజు వారి పరిధిలోని ఇండ్లను సందర్శించి, ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న తల్లులకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలను పంపిణీ చేస్తారని తెలిపారు. చేతుల శుభ్రత, మరుగుదొడ్ల వాడకం, తాగునీరు కాచి చల్లార్చి తాగడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిశ్రీ, ఆయుష్ డాక్టర్ పీర్ ఖాదర్, సూపర్‌వైజర్ సుధాకర్, భానుబి, సిబ్బంది సురేష్, హృదఈశ్వరి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా : 'సుగవాసి'

ప్రజాశక్తి - రాయచోటి

మాజీ ఎమ్మెల్యే, కీర్తిశేషులు సుగవాసి పాలకొండ్రాయుడు తన తండ్రి చూపిన బాటలోనే నియోజకవర్గ విద్య వ్యాప్తికి కృషి చేస్తానని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగువాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మాసాపేట శ్రీసుగవాసి రాజారామ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేసిన సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా సుగవాసి ప్రసాద్ బాబు హాజరయ్యారు. పాలకొండ రాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన రాయచోటిలో విద్యకు సరైన సదుపాయాలు లేనందున తమ పూర్వీకులు మాసాపేటలో అప్పటి ప్రభుత్వం పిలుపుమేరకు ఐదు ఎకరాల స్థలాన్ని, ఐదు లక్షల రూపాయలు విరాళం ఇచ్చి పాఠశాల భవనాలు నిర్మించడానికి సహాయం చేశారు అన్నారు. అప్పటినుండి చుట్టుపక్కల గ్రామాల ఎన్నో వేలమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే క్రమంలో తండ్రి సుగవాసి పాలకొండరాయుడు విశేష అధికారాలు ఉపయోగించి ఈ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించారున్నారు. తన తండ్రి చూపిన బాటలోనే రాయచోటి నియోజకవర్గ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఈ పాఠశాల రాయచోటి నియోజకవర్గంలో ఉన్నతమైన పాఠశాలగా ఎదగడానికి ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు పట్ల తమ తండ్రిగారికి ఎనలేని గౌరవాలు కలిగి ఉండేదని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పోటీకి తట్టుకునేటట్లు విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత మనందరి పైన ఉన్నదని ఆయన అన్నారు. విద్యార్థులు అందరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగితే అత్యున్నత శిఖరాలైనటువంటి ఐఎఎస్, ఐపిఎస్, డాక్టర్లు, ఇంజినీర్లుగా ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించే విధంగా పాఠశాల పేరును నిలబెట్టాలన్నారు. ఆ క్రమంలో విద్యకు సంబంధించి ఎటువంటి సహాయ సహకారాలు అందించడానికి తాను ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, సుగవాసి విద్యాధర్, సుగవాసి జానకిరామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి ఆనంద్, సుగవాసి శ్యామ్ కుమార్, సుగవాసి నాగేంద్ర, కారంశెట్టి గిరి, చింతం గోపాలకృష్ణయ్య, మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డిపిఆర్ఒ సేవలు మరువలేనివి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

బదిలీపై వెళ్తున్న డిపిఆర్ఒ పురుషోత్తం జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జెసి ఆదర్శ్ రాజేంద్రన్ తో పాటు పలువురు కొనియాడారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సమాచార శాఖ డిపిఆర్ఒ నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాలో డిపిఆర్ఒ తన విధులను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసే సమీక్ష సమావేశాలు, జిల్లాకు విచ్చేసే విఐపి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలు, వాటి లక్ష్యాలు ఉద్దేశాలను ప్రజలకు చేరవేయడం తదితరాలలో సమర్థ వంతంగా విస్తృత ప్రచారం చేయడంలో జిల్లా యంత్రాంగానికి తన వంతు సహాయ సహకారాలు అందించేవారని తెలిపారు. చివరగా డిపిఆర్ఒ పురుషోత్తం మాట్లాడుతూ నూతన జిల్లాలో ఒడిదుడుకులను అధిగమించి జిల్లాలో తాను విధులు నిర్వర్తించిన కాలంలో కలెక్టర్, జెసి, ఉన్నత స్థాయి అధికారులు, జిల్లా యంత్రాంగం పూర్తిగా తనకు సహాయ సహకారాలు అందించి తోడ్పాటు ఇచ్చారని, ఇందుకు తన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పురుషోత్తంను శాలువలతో కలెక్టరు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధు సూదన్ రావు, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, సమాచార శాఖ డిఐపిఆర్ఒ భరత్ కుమార్ రెడ్డి, ఎపిఆర్ హరినాథ్ నాయక్, జిల్లా అధికారులు, వివిధ మీడియా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం బిడ్డల విద్యకు వరం

- టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తల్లికి వందనం ప్రతి బిడ్డ చదువుకు ఒక వరం లాంటిదని రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. సోమవారం రాజంపేట టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ వాగ్దానంలో ఒకటైన తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని చెప్పారు. చదువుకుంటున్న ప్రతి బిడ్డకు ఆర్థిక సహాయాన్ని అందజేశారని పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంత మంది చదువుకుంటే అంతమందికి డబ్బులు తల్లి ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. ప్రతి బిడ్డ చదువుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. గత ప్రభుత్వం మాదిరిగా కుటుంబంలో ఒక్కరే చదువుకునేలా ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదని, ప్రతి కుటుంబమూ విద్య కోసం ఇబ్బందులు పడకూడదన్నదే ధ్యేయం అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పను, మడమ తిప్పను అని చెబుతారని, కానీ ఆయన చెప్పేది అమ్మ ఒడి కానీ, మద్యపానం నిషేధం కానీ, నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తారీఖున జాబ్ క్యాలెండర్‌కానీ . ఎన్నో హామీలు ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి బిడ్డకు వారి తల్లి బ్యాంకు ఖాతాలో రూ 13 వేలు జమ చేసి రూ 2 వేలు పాఠశాల అభివృద్ధికి కలెక్టర్ ఖాతాలో జమ చేస్తే ఆ విషయాన్ని వక్రీకరించారని పేర్కొన్నారు. ప్రజలకు అబద్ధాలు చెబుతూ రూ 2 వేలు నారా లోకేష్ ఖాతాలోకి వెళ్లడం జరిగిందని అబద్ధపు మాటలు చెప్పడం వైసిపి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. మరి నారా లోకేష్ అకౌంట్‌కు ఆ డబ్బులు పడినట్లు నిరూపించాలని, లేనిపక్షంలో భేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్. వి రమణ, టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, నందలూరు క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, నాగ ముని రెడ్డి, పరుశురాం నాయుడు, వాణి, శ్రీహరి, శ్రీను, ఎస్సీ నాయకులు రామ్మోహన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ నాయకులు, ఎఒ

రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి - కలికిరి

ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి అన్నారు. సోమవారం సచివాలయం-3 పరిధిలోని చెరువుముందరపల్లి, అచిపిరెడ్డివారిపల్లి, చింతమాకులపల్లి గ్రామాల్లోని రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల నగదు కూడా ఇస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి రైతు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాస్ వర్మ, మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు రాంబాబు, సిద్దు, దినకర్, వెంకటనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో 'ఉపాధి' ఎపిఒ మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఉమామహేశ్వరరావు (ఫైల్)

ఉపాధి హామీ చట్టంలో పెనగలూరు మండలం ఎపిఒగా పనిచేస్తున్న కె.ఉమా మహేశ్వరరావు(53) సోమవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాలు మేరకు ఉమా మహేశ్వరరావు రెండు వారాలుగా అనారోగ్యంతో తిరుపతిలోని ఓప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవలే కోడూరు మండలంలో ఎపిఒగా పనిచేస్తూ బదిలీపై పెనగలూరు మండలానికి వెళ్లారు. ఆయన మృతికి పలువురు అధికారులు, సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.లక్ష మేర ఆస్థి నష్టం

ప్రజాశక్తి-గాలివీడు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని గోరాచెరువు పంచాయతీ ఎస్‌టి కాలనీలో చోటు చేసుకుంది. సుమారు రూ. లక్ష మేర ఆస్థి నష్టం వాటిల్లింది. బాధితుల కథనం మేరకు సోమవారం ఎస్‌టి కాలనీలో సుబ్బమ్మకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. బాధితురాలు ఇంటి బయట దుస్తులు ఉతుక్కుంటు ఉండగా మనమళ్లు ముందుభాగంలో ఆడుకుంటున్నారు. ఇంట్లోని టివి ఒక్కసారిగి పేలి మంటలు వ్యాపించింది. వెంటనే సుబ్బమ్మ రాయచోటి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే రూ. 15 వేల నగదు, టీవీ, దుస్తులు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న తహశీల్దార్ జె.భాగ్యలత, విఆర్ఒ రవీంద్రరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నష్టపరిహారంపై విచారించి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపి బాధితురాలికి న్యాయం చేస్తామని ఆమె చెప్పారు.

చెరువు రోడ్డుపై గుంతలను పూడ్చండి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో కోమటివాని చెరువు రోడ్డుపై గుంతలను పూడ్చాలని బహుజన్ యువసేన అధ్యక్షుడు పునీత్ మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ 20 రోజుల కిందట కోమటి వాని చెరువు రోడ్డును మరమ్మతులు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, మున్సిపల్ కమిషనర్ సమస్యను సిఫార్సు చేశారన్నారు. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు కోమిటివాని చెరువుపై రోడ్డును ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఆ రోడ్డు ఎక్కువ శాతం గుంతలు పడడంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చెరువుకు ఇరువైపులా ఉన్న ఇనప సేఫ్టీ రాడ్లు విరిగిపోవడంతో ప్రమాదవశాత్తు వాహనాల అదుపు తప్పితే ఒకవైపు చెరువులోకి మరోవైపు మెయన్ రోడ్డులో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. అంతటి ప్రమాదకరంగా ఉన్న రోడ్లను మరమ్మతులు చేయించకపోవడం బాధాకరమన్నారు. విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, ఇరువైపులా సేఫ్టీ రాడ్లు నిర్మించి ప్రజలు ప్రాణాలను కాపాడాలని కోరారు. ఇప్పటికీ నిర్లక్ష్యం వహిస్తే ఆ రోడ్డు వద్దే బైఠాయించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బివైఎస్ నాయకులు శ్రీనివాసులు, శశి కుమార్, బాలకృష్ణ, పూర్ణ, వినయ్, నిజాం, బ్రహ్మ, దేవేష్, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

విత్తన కాయలు సకాలంలో పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుశనగ విత్తన కాయలు సకాలంలో అందించాలని లక్కిరెడ్డిపల్లి ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్థానిక లక్కిరెడ్డిపల్లె టౌన్ సచివాలయంలో రైతులకు సిబ్బందితో కలిసి వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి రాజకుమారి, ఉద్యాన శాఖ అధికారి సింధూరితో కలిసి ఆయన మాట్లాడుతూ రైతులకు వేరుశనగ విత్తన కాయలతో పాటు కందులు వంటి చిరుధాన్యాల పంటలు విత్తనాలు అందజేసేలా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నాణ్యమైన విత్తనాలను అందజేసేందుకు చొరవ చూపాలన్నారు. ముదురు మామిడి తోటల్లో కలుపుమొక్కల నివారణ చర్యలు చేపట్టేందుకు రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారానికి సూచించారు. ప్రభుత్వం నుండి సబ్సిడీ ద్వారా ఉద్యాన రైతులకు కత్తెరలు, రంపాలు వంటివి అందజేయాలన్నారు. కార్యక్రమంలో కో- ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమిర్, సర్పంచ్‌లు వెంకటనారాయణరెడ్డి, చెంద్రాయుడు, ఎంపిటిసి సభ్యులు దస్తగిరి, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, జగన్మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ భాష, వైఎస్ఆర్సిపి నాయకులు సుబ్బరాజు, రవి రెడ్డి, దిలీప్ రాజు, ఎఇఒ కేరోలిన్, సాయి, రైతులు పాల్గొన్నారు.

సోలార్‌తో వినియోగదారులకు అధిక లాభం

ప్రజాశక్తి-పీలేరు

విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ ఛార్జీలను తగ్గించుకునేందుకు విధిగా తమ ఇళ్లపై సోలార్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌పిడిసిఎల్ సిజిఎం జానకిరామ్ తెలిపారు. సోమవారం తిరుపతి మార్గంలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పీలేరు ఎస్‌పిడిసిఎల్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన విద్యుత్ సిబ్బందికి రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్‌కు రూ.30,000, రెండు కిలోవాట్లకు రూ.60,000, మూడు కిలోవాట్లకు రూ.78,000 రాయితీని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ప్రతి విద్యుత్ ఉద్యోగి తమ ఇళ్లపై కూడా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ వినియోగం తగ్గడంతోపాటు విద్యుత్ బిల్లులో 70 శాతం తగ్గుతాయన్న విషయాన్ని వినియోగదారులకు గుర్తుచేయాలని చెప్పారు. రాయితీ విషయాలను క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా వినియోగదారులకు వివరించి వారు సోలార్ టాప్‌లను ఇళ్లపై ఏర్పాటు చేసుకునేందుకు సహకరించాలని సూచించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ మొత్తం నేరుగా వినియోగదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తుందన్నారు. వినియోగదారులు తమ వంతు వాటాగా కేవలం 15 శాతం వెచ్చిస్తే, మిగిలిన మొత్తం బ్యాంకులు రుణంగా ఇస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా టెక్నికల్ డిఇ ఈశ్వర్ రెడ్డి, పీలేరు ఎడిఇ లు అమీర్, శివయ్య, ఎఇలు అబ్దుల్ ఖాదర్ ఇలాహి, రామ్మూర్తి, ట్రాన్స్‌కో క్షేత్రస్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.